

### రాత్రి వేళ సెక్యూరిటీ పెంచాలి

నైట్ డ్యూటీ చేసే వైద్యులకు సెక్యూరిటీ పెంచాలి. రాత్రి వేళ గైనికాలజీ కేసులు వచ్చినప్పుడు కాల్ డ్యూటీ నిమిత్తం మహిళా డాక్టర్లు రావాలంటే భద్రతతో కూడిన వాహనం లేదు. గతంలో అంబులెన్స్ ఉండేది. ప్రస్తుతం కాల్ డ్యూటీకి వచ్చే వైద్యులకు రక్షణ లేకుండా ఉంది. ఏ సమయంలోనైనా రావాలంటే భయమేస్తోంది. పురుషులకు, మహిళా వైద్యులకు వేర్వేరు రాత్రి వేళ డ్యూటీ గదులు ఉండాలి. రాత్రి వేళల్లో ఏమైనా కేసులు వచ్చినప్పుడు పేషెంట్లతో మద్యం సేవించిన వారు వస్తుంటారు. వారిని కంట్రోల్ చేయాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది.

డాక్టర్ ఇంద్రాణి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, కందుకూరు






### ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**పామూరు:** మహిళా వైద్యుల భద్రతకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది భద్రత ముఖ్యం. వైద్యశాలలకు ప్రహరీలు, షిఫ్ట్ సిస్టంలో వాచ్‌మెన్‌లు, రాత్రి వేళల్లో డ్యూటీలు చేసే వైద్యసిబ్బందికి ఒకరు మగ, మరొకరు మహిళ ఉండేలా చూసుకోవడం మంచిది. రాత్రివేళల్లో వైద్యంకోసం వచ్చేవారిని బ్రీత్ ఎనలైజర్‌తో చూసిన తరువాతే వైద్యశాలలోకి అనుమతించాలి. మద్యం దుకాణాలు వైద్యశాలలకు దూరంగా ఉండేలా చూడాలి.

డాక్టర్ యం.విజయ్‌కుమార్, బొట్లగూడూరు

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవిచంద్రబాబు

**పొన్నలూరు:** ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ రవిచంద్రబాబు సూచించారు. మండలంలోని చెరుకూరు ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై ప్రశ్నించి వారి పఠనా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు గ్రామస్తులు, పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు.

### అనధికారిక బ్యార్నీలు నిర్మిస్తే చర్యలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

**టంగుటూరు:** టుబాకో బోర్డు అనుమతి లేకుండా బ్యార్నీలు నిర్మిస్తే చర్యలు తప్పవని టంగుటూరు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. కోల్డ్ స్టోరేజీలో ఉన్న బేళ్ల వివరాలు, బయటకు తీసి వేలంలో పెట్టిన బేళ్ల వివరాలను సంబధింత బోర్డు వారికి తెలియజేయాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన వేలానికి కె.ఉప్పలపాడు క్లస్టర్ రైతులు 963 బేళ్లు తీసుకురాగా వాటిలో 869 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.330.19 పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

### హెల్మెట్‌తో ప్రాణాలు సురక్షితం



సింగరాయకొండలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేంద్ర

**సింగరాయకొండ:** ద్విచక్ర వాహణదారులు హెల్మెట్ వినియోగించి ప్రాణాలకు స్వీయ రక్షణ కల్పించుకోవాలని ఎస్సై బి.మహేంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, మృతి చెందినవారి కుటుంబాలు దిక్కులేనివి అవుతున్నాయన్నారు. వాహనదారులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.

### వక్ఫ్‌బోర్డ్ భూములపై కేంద్రం కుట్ర



పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

**పామూరు:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింల భూములు, ఆస్తులను అదానీ, అంబాలనీలకు కట్టబెట్టే కుట్ర చేస్తోందని ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.ఖాదర్‌బాషా అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన పామూరులో నిరసన ర్యాలీ చేపట్టారు. గతంలో రాజుల ముస్లింల వివిధ అవసరాల కోసం భూములను కేటాయించారని.. ప్రభుత్వం వాటిని కాజేసేందుకు పార్లమెంటుల్లో వక్ఫ్‌బోర్డ్ చట్టసవరణబిల్లు తేవడం బీజేపీ కుట్రకు నిదర్శనమన్నారు.

### భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

**పామూరు:** పవిత్ర శ్రావణమాసం సందర్భంగా స్థానిక వాసవీమాత ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు తులసీనాథ్, రాఘవ సుమంత్ సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలతో కుంకుమపూజ నిర్వహించారు.

**కనిగిరి రూరల్:** స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం వేడుకలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

### 1111 పొగాకు బేళ్లు కొనుగోలు

**కొండపి(సింగరాయకొండ):** కొండపి వేలం కేంద్రంలో శుక్రవారం 1111 బేళ్లు కొనుగోలైనట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1329 బేళ్లు వేలానికి తీసుకురాగా వ్యాపారులు వివిధ కారణాలతో 218 బేళ్లు తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.292.26 పలికింది. వేలంలో 15 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం



మర్రిపూడి సభలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



పామూరు: పనులు కల్పించాలని కోరుతున్న కూలీలు, సీపీఐ నాయకులు



అనంతవరం సభలో మాట్లాడుతున్న సర్పంచ్ శివరామరాజు



వెలిగండ్ల: మరపగుంట్లలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అర్జున్ నాయక్



కందుకూరు: గ్రామసభలో అర్జీ ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**మర్రిపూడి:** మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి నాయకులంతా తోడ్పాటునందించాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ కదిరి భాస్కర్ అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గుండ్లసముద్రం, మర్రిపూడి చెరువులకు పైప్‌లైన్ ద్వారా సాగర్ నీరు అందించేందుకు రూ.32 కోట్లు మంజూరయ్యాయని, ఆ పనులు నిలిచిపోకుండా ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మర్రిపూడి బస్టాండ్ సెంటర్ నుంచి పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండ వరకు తారు రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసిందని, అవసరమైతే సంబంధిత అనుమతి పత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. ఈ విషయాలపై అందరం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కలుద్దామని, మండలాన్ని అభివృద్ధి బాటలో నిలిపేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఉపాధి హామీ పనులు ఎక్కడైతే అవసరమో అక్కడ చేయాలని సూచించారు. కార్యక్రమంలో యర్రమోతు శ్రీనివాసులు, తుళ్లూరి నర్సింహారావు, చేరెడ్డి నర్సారెడ్డి, గొంటు హనుమారెడ్డి, ఏట ఖాశింపీరా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులు గుర్తించాలి**

**పొన్నలూరు:** ఉపాధి హామి పథకం ద్వారా గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులు గుర్తించాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. స్థానిక సచివాలయం ఆవరణంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులతో కనీస వసతులైన తాగునీరు, అంతర్గత రహదారుల నిర్మాణం, మరుగుదొడ్లతో పాటు విద్యుత్, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సభలో పంచాయతీ కార్యదర్శి హరినారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధే లక్ష్యం**

**టంగుటూరు:** గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యమని డీఆర్డీఏ ఏపీడీ వసుంధర పేర్కొన్నారు. శుక్రవారం తూర్పునాయుడుపాలెం, టంగుటూరు, మల్లవరప్పాడు గ్రామ సభలను ఆమె సందర్శించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వివిధ శాఖల ద్వారా చేపట్టే పనులపై తీర్మానాలు చేశారు. అనంతవరంలో సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు మాట్లాడుతూ..పని ప్రదేశంలో కూలీలకు మంచి నీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచడం లేదన్నారు. ఇదిలా ఉండగా పలు గ్రామాల్లో సభలకు ఉపాధి హామీ కూలీలను తరలించి వారికి ఇస్తామన్న కూలి ఇవ్వకపోవడంతో తిట్ల దండకం అందుకున్నారు. అనంతవరం సభలో ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, ఎంపీడీఓ రత్నజ్యోతి, ఏపీఓ సుభాషిణి, శారీమందిర్ వెంకటేశ్వర్లు, యరమాల వెంకట్రావు పాల్గొన్నారు.

**పామూరు:** జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని పలువురు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి గ్రామ సభలో డిమాండ్ చేశారు. ఉపాధి గ్రామ సభ శుక్రవారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ అల్లూరి రాగమ్మ అధ్యక్షతన జరిగింది. పలువురు మాట్లాడుతూ ఉపాధి పనులు సరిగా కల్పించడం లేదని, గడ్డపారలు ఇవ్వడంలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా గతంలో చేసిన పనులకు రావాల్సిన కూలీలకోసం వారాల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి నిధులతో సీసీరోడ్ల నిర్మాణం, కాల్వల నిర్మాణం చేపట్టాలని కూలీలు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో పీఎస్ వి.బ్రహ్మనందరెడ్డి, పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, కొండిశెట్టి రమణయ్య, ఇర్రి కృష్ణారెడ్డి, పందిటి హరీష్, సయ్యద్ అమీర్‌బాబు, ఎంఏటీ నాయబ, రహీముల్లా, పలువురు పాల్గొన్నారు.

**కందుకూరు రూరల్:** రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో నిర్వహించిన గ్రామ సభలు కందుకూరు మండలంలోని 19 పంచాయతీల్లో నిర్వహించారు. కొండముడుసుపాలెం గ్రామ సభలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. పంచాయతీల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500 కోట్ల నిధులతో 87 రకాల పనులకు ఆమోదం తెలిపిందన్నారు. ఇన్‌చార్జీ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏడీఏ అనసూయ, డీఎల్‌పీఓ కృష్ణమోహన్, సర్పంచ్ తుమ్మా కోటేశ్వరమ్మ, ఎంపీపీ ఇంటూరి సుశీల, ఏపీడీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు:** గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం గుడ్లూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం గుడ్లూరులో జరిగిన గ్రామసభలో ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. వెంకటేశ్వర్లు, దామా క్రిష్ణయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, కొనిదన మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

**లింగసముద్రం:** గ్రామ సభలు శుక్రవారం నిర్వహించినట్లు ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు చెప్పారు. మండల ప్రత్యేకాధికారి, డిస్ట్రిక్ట్ ఫారెస్ట అధికారి శ్రీనివాసులరెడ్డి యర్రారెడ్డిపాలెం, మేదరమిట్లపాలెం గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో మాట్లాడారు. ఏపీఓ సమీర్‌బాషా, వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, సర్పంచ్ డబ్బుగొట్టు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**పీసీ పల్లి:** గ్రామ సభల్లో ఎక్కువ మంది సభ్యులు హాజరు కావాలని స్పెషలాఫీసర్ జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. నేరేడుపల్లి జరిగిన సభలో మాట్లాడారు. ఇటీవల వాటర్ షెడ్డు పనుల్లో అవినీతి జరిగిందని నిధులు మొత్తం ఒకరి పేరు మీదే డ్రా అయినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.

**హనుమంతునిపాడు:** గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను గుర్తించాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. ఎంపీడీఓ కె.లలిత మిట్టపాలెం, హాజీపురం, దొడ్డిచింతల గ్రామాల్లో మాట్లాడారు. రోడ్లకు ఇరువైపుల మొక్కల నాటేందుకు, కుంటలు పూడిక, చెరువుల పూడిక, సీసీ రోడ్లు, పండ్ల తోటల సాగు తదితర పనులు గుర్తించాలన్నారు. నూడల్ అధికారులు జి.పెద్దిరాజు, రమణయ్య, షేక్ షరీఫ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

**వెలిగండ్ల:** గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి అర్జున్‌నాయక్ అన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ, లింక్‌రోడ్ల నిర్మాణం, వ్యక్తిగత సోక్‌పిట్స్ నిర్మాణం, గ్యాస్ లేని వారికి గ్యాస్ కనెక్షన్‌లు, కరెంట్ సమస్య, పండ్ల తోటల పెంపకం తదితర పనులకు సంబంధించి గ్రామంలోని ప్రజలు అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు. ఏపీఓ శ్రీనివాసనాయక్, పీఆర్ఏఈ బి.బ్రహ్మయ్య, ఎస్. రంగాకృష్ణ, నోబల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

**కనిగిరి రూరల్:** అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, ప్రాధాన్యత ప్రకారం చేయాల్సి పనులను నివేదికల్లో పొందు పర్చాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని వంగపాడు పంచాయతీలో గ్రామ సభ శుక్రవారం జరిగింది. సర్పంచ్ తిరుపతయ్య, ఉప సర్పంచ్ సిద్దారెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు



పీసీ పల్లి: మాట్లాడుతున్న అధికారులు



లింగసముద్రం: యర్రారెడ్డిపాలెంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు



ముప్పళ్లపాడులో అర్జీలు ఇస్తున్న కూలీలు

# ఆంధ్రకేసరి మార్గం అనుసరణీయం



కందుకూరు: ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



పామూరు: నివాళులర్పిస్తున్న సర్పంచ్, నాయకులు

**పామూరు:** ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మార్గం అనుసరణీయమని పామూరు సర్పంచ్ అల్లూరి రాగమ్మ, పీఎస్ వి.బ్రహ్మనందరెడ్డి పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153 జయంతి వేడుకలు శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటీష్ వారికి గుండె చూపి ఎదురొడ్డిన ధీరశాలి టంగుటూరి ప్రకాశం పంతులన్నారు. దేశభక్తి, దానగుణం ఉందని.. ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రకాశం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. డీవీ మనోహర్, పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, కొండిశెట్టి రమణయ్య, ఇర్రి కృష్ణారెడ్డి, పందిటి హరీష్, సయ్యద్ అమీర్‌బాబు, ఎంఏటీ నాయబ, రహీముల్లా, పలువురు పాల్గొన్నారు.

**ఉలవపాడు:** ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. నిజాయితీ గల నాయకుడిగా ఆయన సేవలు మరిచిపోలేనివన్నారు. ఆయన అడుగు జాడల్లో యువత నడవాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

**కందుకూరు:** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రకేసరి సేవా సమితి ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో గల ప్రకాశం పంతులు విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రకాశం పంతులు విగ్రహానికి నివాలులర్పించారు. నేటి రాజకీయ నాయకులకు టంటూరి స్ఫూర్తిదాయకమన్నారు. ఆంధ్రకేసరి సేవా సమితి అధ్యక్షుడు మంచిరాజు మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్కందపురి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ ఇప్పగుంట నాగరాజారావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఇప్పగుంట మాధవరావు, ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, దత్తాత్రేయ స్వామి ఆలయ ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, డాక్టర్ తన్నీరు మల్లిఖార్జునరావు, గణపతిరాజు శేషగిరిరావు, కాకర్ల రాజగోపాల్, ఆర్ఎంపీ డాక్టర్ రాధాకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు రూరల్:** తెలుగుజాతి గర్వించదగ్గ నాయకుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రకేసరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహనీయుడు ఆంధ్రకేసరి సాహసానికి మారుపేరన్నారు. పేదరికంలో పుట్టి స్వయం కృషితో ఎదిగి ప్రజా జీవితంలో ఒదిగి తన జీవితాన్ని సాఫల్యం చేసుకున్న కార్యదక్షుడు ప్రకాశం పంతులన్నారు. గుండెనే తుపాకీ గుండుగా పేల్చిన నిస్వార్థ దేశభక్తుడన్నారు. పీడీ తొట్టెంపూడి సుబ్బారావు, అధ్యాపకులు పరుచూరి ఉష, శిరీష, బాబురావు, సీతారావమ్మ, భాస్కరరావు, హజరత్తయ్య, కట్టా సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



టంగుటూరు గ్రంథాలయంలో..



ఉలవపాడులో ప్రకాశంకు నివాళి



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఆంధ్రకేసరి మార్గం అనుసరణీయం**

**టంగుటూరు:** స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మార్గం అనుసరణీయమని గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు పేర్కొన్నారు. టంగుటూరి జయంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు ప్రియాంక, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కనిగిరి రూరల్:** ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ టీవీ రంగారావు, కౌన్సిలర్లు దేవకి సత్యావతి, పులి శ్రీనివాసులరెడ్డి, పి. అరుణోదర్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్‌రావు, ఆర్ఐ ప్రదీప్, పూర్ణిమ, మెప్మా సీఎంఎం రఘు, మున్నా పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

**టంగుటూరు:** ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్ల వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక బొమ్మల సెంటర్లో ట్రాఫిక్ సమస్యకు గల కారణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్లపై ఇష్టారీతిగా వాహనాలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామాలల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినా, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



టంగుటూరులో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

## సీజనల్ వ్యాధుల నివారణకు కృషి

**సింగరాయకొండ:** ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా, దోమకాటు నుంచి రక్షించడానికి పంచాయతీలో ఫాగింగ్ చేయనున్నట్లు సర్పంచ్ తాటిపర్తి వనజ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలయోగినగర్‌లో శుక్రవారం సాయంత్రం ఫాగింగ్ యంత్రాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య,వార్డుసభ్యులు, ప్రణయ్ పాల్గొన్నారు.



ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వనజ

## కొండారెడ్డికి నివాళులర్పించిన దద్దాల

**పీసీ పల్లి:**

మండలంలోని పిల్లవారిపల్లి.. వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారా శీల కొండారెడ్డి గుండెపోటుతో మరణించారు. దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీటీసీ ఓకే రెడ్డి, మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఎంపీటీసీలు భూమిరెడ్డి కొండారెడ్డి, కొండయ్య, మూలే రాజశేఖర్ రెడ్డి, ఏరువ నరసింహ, శీలం సుదర్శన్, మేకల మాల్యాద్రి, సర్పంచ్ బాలిరెడ్డి, మాజీ సర్పంచ్ దుంప మాలకొండయ్య, గోళ్ళ శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

## వసతి గృహాన్ని సందర్శించిన మంత్రి డోలా

**కనిగిరి రూరల్:** వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర సాంఘిక, సంక్షేమ దివ్యాంగుల, వయో వృద్ధుల, సంక్షేమ సచివాలయాలు, వలంటీర్ల శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించారు. మంత్రి డోలా మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియాలతో సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో హాస్టల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తొలుత ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలను మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్, ఎమ్మెల్యే